క్లుప్తంగా

చాంబర్ బిల్డింగ్ ట్రస్ట్ కార్యదర్శిగా సురేష్


సురేష్ కుమార్‌ను అభినందిస్తున్న చాంబర్ ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ట్రస్ట్ కార్యదర్శిగా పచ్చిగోళ్ల సురేష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక చాంబర్ కార్యాలయంలో అధ్యక్షుడు తవ్వా సూర్యనారాయణ మూర్తి (తవ్వా రాజా) అధ్యక్షతన జరిగిన ది చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్ ట్రస్ట్ సభ్యుల సమావేశంలో సురేష్ కుమార్‌ను 2024–26 సంవత్సరానికి గానూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు తవ్వా రాజా, చాంబర్ బిల్డింగ్ ట్రస్ట్ ఎక్స్‌అఫీషియో ట్రస్టీ ఆకుల శ్రీనివాస్, లైఫ్ ట్రస్టీలు గ్రంధి వెంకటేశ్వరరావు, మావూరి శివకుమార్, విక్రమ్ ఎస్.జైన్, గ్రంధి సత్యగోపాలకృష్ణ, కోగంటి విజయకుమార్, ఎలక్టెడ్ ట్రస్టీలు నూలి శివ మల్లికార్జున, గ్రంధి బ్రహ్మానందం (రాజా) తదితరులు సురేష్‌కుమార్‌ను అభినందించారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

కంబాలచెరువు: స్థానిక మూలగొయ్యి ప్రాంతంలోని డ్రైనేజీలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ గుణదలకు చెందిన కె.శ్రీహరి ప్రసాద్ (51) గోకవరం బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఒక హోటల్‌లో పని చేస్తున్నాడు. అతను నిత్యం మూలగొయ్యిలోని డ్రైనేజీ గోడపై కూర్చుని మద్యం తాగేవాడు. అయితే అతను మూడు రోజుల నుంచి రాకపోవడంతో హోటల్ యజమాని అతని ఇంటికి వెళ్లాడు. తలుపు వేసి ఉండడంతో అతని కోసం చూశాడు. ఈ క్రమంలో మూలగొయ్యి రామాలయం వద్ద డ్రైనేజీలో వ్యక్తి మృతదేహం తేలియాడుతుందని, అటుగా వెళ్లిన అతను శ్రీహరిప్రసాద్‌ను గుర్తుపట్టి సమాచారాన్ని పోలీసులకు తెలిపాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మతిస్థిమితం లేని మహిళకు అంత్యక్రియలు


కోటిలింగాల ఘాట్ వద్ద మతిస్థిమితం లేని మహిళ మృతదేహంతో సమీరాబేగం

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన మతిస్థిమితం లేని మహిళకు బొమ్మూరు గ్రామానికి మహిళా మండలి నాయకురాలు ఎస్కే సమీరాబేగం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రెండు నెలల నుంచి బొమ్మూరు గ్రామంలో మతిస్థిమితం లేని గుర్తుతెలియని మహిళ తిరుగుతుంది. ఆ సమయంలోనే సమీరాబేగం ఆ మహిళను శుభ్రంచేసి, రోజూ భోజనం పెడుతూ చూసుకుంటుంది. రెండు రోజుల క్రితం వేమగిరి వద్ద బొలెరో వాహనం మతిస్థిమితం లేని మహిళను ఢీకొట్టింది. ఆమె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. దీంతో పోస్టుమార్టం అనంతరం ఆమె అంత్యక్రియలను కోటిలింగాలఘాట్‌లో కడియం పోలీసుల ఆదేశాల మేరకు సమీరాబేగం నిర్వహించారు. నర్సరీరైతు తాడాల చక్రవర్తి, మత్సేటి శివ, నాగరాజా ఫైనాన్స్ ఆర్థిక సాయం అందించగా, చంటిరాజు సహకారం అందించారని సమీరాబేగం తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రకాశంనగర్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని మనం ఫౌండేషన్, మణి బ్లడ్ ఆర్మీ సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సంజీవని బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనికి మనం ఫౌండేషన్ డాక్టర్ చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం మరొకరి జీవితాన్ని కాపాడుతుందన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రెండుసార్లు డాక్టరేట్లు సాధించిన మణికుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎల్.మల్లిబాబు, కె.కృష్ణమోహన్, కుమార్ స్వామి, షేక్ తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

కడియం: వీరవరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సర్పంచ్ బత్తుల జయంతీ రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఉప సర్పంచ్ దొంతంశెట్టి వీరభద్రయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, ఏసీడీపీఓ కనకవల్లి పాల్గొన్నారు.


పార్కులోని కొలనులో పేరుకుపోయిన గుర్రపుడెక్క


ఏబీ నాగేశ్వరరావు పార్క్‌లో చెత్త

పార్కు... రిమార్కు

- ఉద్యానంలో సమస్యల తిష్ట
- ఆహ్లాదం కోసం వస్తే అనారోగ్యమే

సీటీఆర్ఐ: కాస్త తీరిక దొరికినా.. సరదాగా పిల్లలను ఎక్కడకైనా తీసుకెళ్లాలన్నా.. కాసేపు వాకింగ్ చేయాలన్నా ముందుగా గుర్తొచ్చేది పార్కులే. ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు వెక్కిరిస్తున్నాయి. సమస్యల మాటున కూనరిల్లుతున్నాయి.. ఇక్కడకు ఎందుకు వచ్చామురా బాబూ.. అనేలా దర్శనమిస్తున్నాయి. ఉద్యానాలకు ఉదయం వాకర్స్ నడకకు, సాయంత్రం పిల్లలతో కుటుంబాలు, యువత వస్తుంటారు. కానీ రాజమహేంద్రవరంలోని కొన్ని పార్కులు సమస్యలతో ఆహ్వానం పలుకుతున్నాయి. స్థానిక 39వ డివిజన్‌లోని ఆర్యాపురం వద్ద డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు పార్కు అందుకు నిదర్శనం. ఈ పార్కులోని కొలను మాత్రం ఏడాది పొడుగునా గుర్రపుడెక్కతో నిండి ఉంటుంది. ఎప్పుడో అధికారులకు గుర్తొచ్చినప్పుడు గుర్రపు డెక్కను తొలగిస్తారు. తరువాత అటువైపు చూడరు. ఈ


ఆర్యాపురం ఏబీ నాగేశ్వరరావు పార్క్

పార్కు రోడ్డును అనుకుని విశాలంగా ఉంటుంది. ఈ సమీపంలో ఆర్యాపురం, తుమ్మలావ, వాంబే గృహాలు తదితర ప్రాంతాల ప్రజలు నివసిస్తుంటారు. చాలా మంది ఈ పార్కుకు సేద తీరాలని వస్తుంటారు. ఇక్కడ కాసేపు కూడా కూర్చోలేని దుస్థితి. గుర్రపుడెక్క ఉండటం వల్ల పార్కులో దుర్గంధం వస్తుంది. పార్కులోనే కాకుండా బయట కూడా ఈ వాసన భరించలేక పోతున్నారు. దీనివల్ల ఇక్కడకు ఎవరూ రావడం లేదు. ఇంత విశాలమైన పార్కును శుభ్రపరిచి ప్రజలకు అందుబాటులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ష్... గంజాయి బ్యాచ్

పార్కు చుట్టూ లైటింగ్ లేకపోవడంతో రాత్రి సమయంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు అడ్డగా మారింది. ఈ పార్కు గోడలు దూకి లోపలకు ప్రవేశిస్తూ నానా హంగామా చేస్తున్నారు. తాగి పడేసిన మద్యం సీసాలతో ఉదయం పార్కు అస్తవ్యస్తంగా కనిపిస్తుంది. అక్కడకు వెళ్లి చూసుకోకుండా కాలు వేస్తే పగిలిన మద్యం సీసాలు గుచ్చుకుంటున్నాయని పలువురు వాపోతున్నారు. రాత్రిళ్లు పోలీసుల గస్తీ లేకపోవడంతో వీరి ఆగడాలకు అంతులేకుండా పోయింది. అంతేకాకుండా ఒక్కోసారి మద్యం తాగుతూ ఇక్కడ చిందులు వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కార్పొరేషన్, పోలీసు అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఎక్కడ చెత్త అక్కడే..

పార్కులో ఎక్కడ చెత్త అక్కడే ఉంటుంది. దీనికి ప్రధాన కారణం పారిశుధ్య లోపం. నగర పాలక సంస్థ ఆదాయం వచ్చే పార్కులను తప్ప ఇటువంటి పార్కులను పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. ఈ పార్కులో పారిశుధ్యం కొరవడటంతో పాటు ఒకవక్క పిచ్చి మొక్కలు, మరోపక్క చెత్తా చెదారంతో చూడాలంటేనే హడలిపోతున్నారు. కనీసం పారిశుధ్య కార్మికులను పంపి అక్కడ శుభ్రం చేయించాలన్న శ్రద్ధ అధికారులకు లేకుండా పోయింది.

వారికీ ఇబ్బందే..

పార్కులో డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు స్మారక పార్కు ఆవరణలో సీనియన్ సిటిజన్స్ భవనం కూడా ఉంది. ఇక్కడ గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజా సంక్షేమ వేదిక ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. వృద్ధాప్య జీవనం నరకం కాకూడదని, ఆనందంగా ఆత్మ గౌరవంతో సాగాలని, కుటుంబ సంబంధ బాంధ్యావాలు విలువనిచ్చే విధంగా సీనియర్ ప్రతి రోజు కార్యక్రమాలు నిర్వహిస్తారు. కానీ పార్కులో వచ్చే దుర్గంధానికి సాయంత్రం ఒక గంట మాత్రమే ఇక్కడ ఉండగలుగుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

పార్కులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలి. ఇది శాశ్వతంగా రాకుండా చేస్తే సందర్శకులు అనేకమంది వస్తారు. చెత్తాచెదారం పేరుకుపోయి, దుర్గంధ భరితంగా మారడంతో లోపలకు ఎవరూ రావడం లేదు. సాయంత్రం వేళలో ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. వీటిని పోలీసులు అరికట్టాలి.

– కె.శంకరరావు స్థానికుడు

గస్తీ నిర్వహించాలి

రాత్రిళ్లు కొంతమంది పార్కులోకి ప్రవేశించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. మద్యంతో వచ్చి పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటున్నారు. తరువాత తాగి గొడవలు పడుతున్నారు. ఈ పార్కు బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారింది. పోలీసులు రాత్రి సమయంలో గస్తీ నిర్వహించాలి.

– ఎం.శ్రీనివాసరావు, సీనియర్ సిటిజన్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర విద్యుత్ మరమ్మతుల నిమిత్తం గురువారం నగరంలో పలు ప్రాంతాలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ బుధవారం తెలిపారు. దీని ప్రభావంతో శ్రీరామ్‌నగర్, కళ్యాణ్‌నగర్, ఆదర్శ్ నగర్, ఎంప్లాయిస్ కాలనీ, జంగాల కాలనీ, బీసీ కాలనీ, శేషాద్రి లేఅవుట్, క్వారీ ఏరియా, వీవీ కొండయ్య నగర్, ఫోర్త్ బ్రిడ్జి ఏరియాల్లో ప్రభావం ఉంటుందన్నారు. అలాగే 18వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ పనసచెట్టు సెంటర్, సంజీవ్ నగర్ మొత్తం ఏరియాల్లో ప్రభావం ఉంటుందన్నారు.

చేతుల శుభ్రతా దినోత్సవం


వాటర్ ట్యాంక్ వద్ద చేతుల శుభ్రంపై విద్యార్థులకు అవగాహన

కంబాలచెరువు: స్థానిక ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాలలో మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేతుల పరిశుభ్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. మేజిక్ బస్ టీఎంఓ ప్రియాంక మాట్లాడుతూ విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసే ముందు, తర్వాత సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జె.అప్పారావు మాట్లాడుతూ విద్యార్థులు తరచూ చేతి గోళ్లను కత్తిరించుకోవాలని, శుభ్రమైన చేతులతోనే ఆహారాన్ని తినాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.విజయ కుమారి, దొర, శ్రీనివాస్, విజేత, పీఈటీ స్వర్ణలత, మేజిక్ బస్ ప్రతినిధి స్వాతి పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ర్యాంకు సాధించాలి


మరుగుదొడ్లను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, వర్మికంపోస్ట్ యూనిట్లు, భవన నిర్మాణ వ్యర్థాలు, విండ్రో ప్లాంట్లు పూర్తి స్థాయిలో పని చేయించాలని కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని డంపింగ్ యార్డ్‌లో లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఎంఎస్ఆర్ లేజెంట్‌లోని వర్మికంపోస్ట్ యూనిట్, మెటీరియల్ రికవరీపై ఫెసిలిటీ సెంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెగసీ వేస్ట్, బయో వేస్ట్ రెమెడియేషన్ సక్రమంగా నిర్వహించాలన్నారు. తడి, పొడి చెత్త సేకరణ, ఇంటింటా చెత్త సేకరణ వంద శాతం జరగాలన్నారు. వచ్చే స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో గతంలో కన్నా మంచి ర్యాంకు రావాలని, అందుకు ఇప్పటి నుంచే కృషి చేయాలని, అదే స్థాయిలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విరూపాక్ష, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోటక్ మహేంద్రా బ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో దానవాయిపేట మున్సిపల్ హైస్కూల్‌లో అభివృద్ధి చేసిన క్రీడా ప్రాంగణాలను ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు


రామ్‌కుమార్‌ను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీరామ్‌గుప్త

రాజమహేంద్రవరం సిటీ: ఉద్యోగులు నిబద్ధతతో పనిచేస్తే గుర్తింపు దానికదే వస్తుందని ఎస్‌బీ మోటార్స్ అధినేత మట్టపల్లి రామ్‌కుమార్ తెలిపారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాస్‌ల దినోత్సవాన్ని ఎస్‌బీ మోటార్స్ (మారుతి కార్ల డీలర్) ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో వృత్తి నిపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం రామ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు, ఎస్‌బీ మోటార్స్ జీఎం మద్దుల వీఎస్ శ్రీరామగుప్త, క్లబ్ కార్యదర్శి వెన్నా కుమారస్వామి, ట్రెజరర్ ఉలగంటి రాఘవరావు, అడ్మిన్ గ్రంధి లక్ష్మి వసంతకుమారి, కక్కిరాల బుచ్చిరాజు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు శానిటరీ లిక్విడ్స్ పంపిణీ


హెచ్‌ఎంలకు శానిటరీ లిక్విడ్స్ అందజేస్తున్న అర్బన్ రేంజ్ డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ నిర్వహణకు శానిటరీ లిక్విడ్స్‌ను ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్టు అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్ తెలిపారు. అర్బన్ పరిధిలోని ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వీటిని అందజేసినట్టు దిలీప్‌కుమార్ చెప్పారు. వీటిని ఆయాలు నిత్యం వినియోగించి, టాయిలెట్స్ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్‌టీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బినీడి ప్రసాద్, కోటేశ్వరి, ఇందిర, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకరంగా మారిన స్పీడ్ బ్రేకర్లు

రాజమహేంద్రవరం గౌతమీ ఘాట్‌లో అయ్యప్ప స్వామి గుడి రోడ్‌లో టూరిజం కార్యాలయం వద్ద వేగం నియంత్రణకు వేసిన స్పీడు బ్రేకర్లు ప్రమాదకరంగా మారాయి. ఈ స్పీడు బ్రేకర్లపై నుంచి భారీ వాహనాలు సైతం వెళ్లడంతో ముక్కలుగా ఊడిపోయాయి. ఈ స్పీడు బ్రేకర్లను బిగించేందుకు వేసిన మేకులు పైకి లేచి ఉండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేకులతో కార్లు, ద్విచక్ర వాహనాలకు ఎక్కడ పంక్చర్లు పడతాయోనని ఆందోళ చెందుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్, నగరపాలక సంస్థ అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)

మాదిగల కృతజ్ఞతా యాత్ర


అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సంఘీయులు

సీటీఆర్ఐ: గతంలో, ఇప్పుడు కూడా ఎస్సీ వర్గీకరణ చేసేది ముఖ్యమంత్రి చంద్రబాబేనని, అందుకే హిందూపురం నుంచి మాదిగల కృతజ్ఞతా యాత్ర చేపట్టామని ఆంధ్రప్రదేశ్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఏపీ ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త పేరుపోగు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఈ యాత్ర రాజమహేంద్రవరం చేరుకున్న సందర్భంగా ఆయన గోకవరం బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశ సామాజిక ఉద్యమాల చరిత్రలోనే గొప్ప తీర్పు అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని, లిడ్ క్యాప్ ఆస్తులను పరిరక్షించాలని, ట్రైనింగ్ సెంటర్లు నిర్వహించాలని, చర్మకారుల అభివృద్ధికి తోడ్పడాలని, ఎస్సీ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలని, అట్రాసిటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని నినాదాలు చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బల్లంకుల రాజు ఆధ్వర్యంలో డప్పులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓను కలసి మాదిగల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ యాత్రలో చెట్టి సుజన్‌రావు, బొబ్బిలి వెంకట్రాజు, బల్లంకుల చింటూ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం


కాతేరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బుధవారం కోలమూరు, కాతేరు గ్రామాల్లో ఎంపీడీఓ డి.శ్రీనివాసరావు అధ్యక్షతన పల్లె పండుగను నిర్వహించారు. కోలమూరులో రూ.2.05 కోట్లతో 42 రోడ్లు, డ్రైన్లకు, కాతేరులో రూ.1.05 కోట్లతో 22 రోడ్లు, డ్రైన్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికార అధికారి కె.నాగజ్యోతి, ఉపాధి హామీ ఏపీడీ బి.రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు డి.శ్రీనివాసరావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకలి కేకలు

- నూతన మద్యం పాలసీతో తంటా
- ఉపాధి కోల్పోయిన సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్‌లు
- భరోసా కల్పించాలంటున్న కుటుంబాలు

మధురపూడి: కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ కొందరి పొట్టకొట్టింది.. మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్ మ్యాన్‌లుగా పనిచేస్తున్న వారికి ఉపాధిని దూరం చేసింది.. గత ప్రభుత్వంలో మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్‌లుగా చేరి కుటుంబాలను పోషించుకుంటున్న వారి జీవితాల్లో నీళ్లు చల్లింది. వారికి ఆకలి బాధలు తెచ్చింది. కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చి ప్రభుత్వ ఖజానాను నింపుకొంటున్న కూటమి వీరిని అర్ధాంతరంగా తొలగించి ప్రత్యామ్నాయం చూపకుండా గెంటేసింది. ఇప్పుడు ఉపాధి లేక వారు కష్టాలు పడుతున్నారు.

కోరుకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 12 మద్యం షాపులు ఉన్నాయి. ఈ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాలు వస్తాయి. గత ప్రభుత్వం ఎక్కడా అవినీతికి తావులేకుండా ఉండేందుకు సర్కారీ మద్యం దుకాణాలను నిర్వహించింది. అక్కడ సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్‌లు తదితర సిబ్బంది పనిచేసేలా నిరుద్యోగులకు ఉపాధి కల్పించింది. ఇలా జిల్లాలోని మద్యం షాపుల్లో 500 మంది, కోరుకొండ సర్కిల్‌లో 50 మంది పనిచేశారు. బుధవారం నుంచి వీరిని కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసింది. నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి వీరికి ఉపాధి లేకుండా చేసింది. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వీరు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్సైజ్, పోలీసు, వివిధ శాఖలకు చెందిన అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా వారికి ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించలేదు. దీని వల్ల ఉపాధి కోల్పోయిన వారు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఉపాధి అవకాశాలు కోల్పోయిన వీరంతా రేపటి నుంచి ఎలా జీవనం సాగించాలనే ఆలోచనలో పడ్డారు. చాలామంది కంటతడి పెట్టుకుంటూ ఎక్సైజ్ అధికారులకు రికార్డులు, స్టాకు వివరాలు అప్పగించారు. ఇక మా తల్లికి వైద్యం చేయించడం ఎలా, పిల్లలకు ఫీజులు ఎలా చెల్లించాలో అంటూ ఇందులో కొందరు మనోవేదనకు గురయ్యారు.


కోరుకొండలో మద్యం షాపుల్లో పనిచేసిన సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్‌లు

మొండి వైఖరి విడనాడాలి



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసిన ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలి. ఉపాధిని కోల్పోయిన యువత పట్ల మానవతా దృక్పథంతో ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి యువతకు ఉద్యోగాలు చూపించాలి.

– గొల్లపల్లి ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు

ప్రత్యామ్నాయం చూపాలి



నూతన మద్యం పాలసీ ప్రకారం తొలగించిన మాకు ప్రత్యామ్నాయం చూపించాలి. కొంతకాలంగా ప్రభుత్వానికి సేవలందించడంతో పాటు ఆదాయ వనరులను కాపాడామన్న దృక్పథంతో చూడాలి. ఉద్యోగాలు కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలవాలి. ప్రభుత్వం మాకు అండగా నిలవాలి.

– ఎస్.పోలరాజు, కోరుకొండ

ఉపాధి కల్పించండి



మద్యం షాపుల్లో పనిచేసిన మాకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఈ విషయమై వివిధ సందర్భాల్లో ఎక్సైజ్, పోలీసు తదితర శాఖలకు చెందిన అధికారులకు వినతి పత్రాలు ఇచ్చాం. మా పట్ల వ్యతిరేక భావాన్ని వీడాలి. కోరుకొండ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో 12 షాపులున్నాయి. ఇక్కడ 50 మంది పనిచేశాం. మా ఆకలి బాధలను అర్థం చేసుకోండి.

– వై.సుబ్బన్న దొర, కోరుకొండ

సినిమాలు

శ్యామల:	వేట్టయన్
సూర్యమినీ:	జిగ్రా
సూర్యప్యాలెస్:	దేవర
శివజ్యోతి:	విశ్వం
అనుశ్రీ:	జనక అయితే గనక
స్వామి:	శ్వాగ్
అశోక:	విశ్వం
రాజా:	మార్టిన్
రంభ:	మానాన్న సూపర్‌హీరో, జనక అయితే గనక
ఊర్వశి:	వేట్టయన్
మేనక:	మార్టిన్
కుమారి:	దేవర
అప్సర:	దేవర
నామవరం:	
వీఎస్.మహల్:	వేట్టయన్, దేవర
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ:	దేవర
కడియం:	
వెంకటసూర్య:	వేట్టయన్